
చిన్నకథ

# నల్ల డబ్బా- ఎర్ర డబ్బా

ఒకడవిలో ఒక ముని వుండేటోడు. ఆయనకు చానా మహిమలు వుండేటివి. కానీ వాటిని ఎవరికీ ఎప్పుడూ చూపేటోడు కాదు. ఆ ముని రోజూ పొద్దున్నే వూర్లోకి వచ్చి ఒక్కొక్క ఇంటి దగ్గర అడుక్కుంటూ వాళ్ళు పెట్టినేవి తీసుకోని అడవికి వెళ్ళిపోయేటోడు. ఆ అడవిలోనే ఒక చిన్న ఇల్లు కట్టుకోని అందులో తపస్సు చేసుకునేటోడు. ఒకసారి ఆ మునికి పెండ్లి చేసుకోవాలని అనిపించింది. కానీ ఆ వూరి జనాలు "నువ్వే అడుక్కొని తింటా వున్నావు... ఇంక నీ పెండ్లానికి ఏం పెట్టి సాకుతావు" అంటూ పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఆ వూరిలో సుబ్బమ్మ అని ఒకామె వుండేది. ఆమెకు ఒక కూతురు. ఒక కొడుకు వున్నారు. వాళ్ళు చానా పేదోళ్ళు. చుట్టుపక్కల ఇళ్ళలో పనులు చేస్తా, పొలం పనులకు కూలీకి పోతా వచ్చిన డబ్బుల్తో కడుపు నింపుకునేటోళ్ళు. కొంత కాలానికి కూతురు పెద్దగయింది. పెద్దగయినాక పెండ్లి చేయాలగదా... కానీ ఆమె దగ్గర అంత డబ్బు లేదు. అప్పుడా కూతురు వాళ్ళమ్మతో "అమ్మా... అమ్మా... నువ్వెట్లాగూ నా పెండ్లి చేయలేవు. ఆ మునికన్నా నన్నిచ్చి చేయి" అనింది. వాళ్ళమ్మకు ఇష్టం లేకపోయినా వేరే దారిలేక మునికికూతురినిచ్చి పెండ్లి చేసింది. పెండ్లి ఖర్చులన్నీ మునే పెట్టుకోని పెండ్లయినాక పెండ్లాన్ని తీసుకోని అడవికి వెళ్ళిపోయినాడు. అక్కడ ఆమెను బాగా చూసుకోసాగాడు.



కొన్ని రోజులయినాక సుబ్బమ్మ కొడుకును పిలిచి "అక్క ఎలా ఉందో చూసి రాపోరా" అని అడవికి పంపిచ్చింది. వాడు అక్కను చేరు కున్నాడు. అక్క తమ్మునికి రకరకాల పిండివంటలు చేసిపెట్టి క్షేమ సమాచారాలన్నీ కనుక్కొని పోయేటప్పుడు మొగుని దగ్గరికి పోయి "సామీ... మా అమ్మవాళ్ళ పరిస్థితి ఏమీ బాగాలేదంట. కాస్త సాయం చేయండి" అనింది. దానికాముని "వంటింటి గూట్లో ఒక ఎర్ర డబ్బా వుంది. అదిచ్చి పంపు. వాళ్ళ కష్టాలన్నీ తీరుతాయి" అన్నాడు. ఆమె ఎర్ర డబ్బాను తమ్మునికిచ్చి "దీన్ని జాగ్రత్తగా తీసుకోని పోయి అమ్మ కియ్యి" అని చెప్పింది. తమ్ముడు ఆ డబ్బా తీసుకోనిపోయి వాళ్ళమ్మకిచ్చినాడు.

ఆమె ఏముందబ్బా ఆ డబ్బాలో అని మూత తెరిచి చూసింది. దానినిండా సొరకాయ విత్తనాలు కనబన్నాయి. ఆమెకు సొరకాయలంటే అస్సలు ఇష్టంలేదు. దాంతో "ఛీ...ఛీ... ఏం చేయాల ఈ పనికి మాలిన విత్తనాలు" అంటూ విసిరి ఇంటిబైట పాడేసింది. కొంత కాలానికి వానలు పడడంతో ఆ విత్తనాలు మొలచి ఇంటిచుట్టూ సొరకాయలు కుప్పలు కుప్పలు కాసినాయి.

ఆమెకు సొరకాయలంటే అస్సలు ఇష్టంలేదుగదా... దాంతో వాటిగురించి ఏమీ పట్టించుకోలేదు.

ఆ ఊర్లో ఓ కోమటాయన వుండేటోడు. వాడు ఒకరోజు అటువైపు పోతా పోతా ఆ సొరకాయలు చూసి "అమ్మా... అమ్మా... ఒక సొరకాయ ఇస్తావా... ఒక రూపాయ ఇస్తా" అన్నాడు. ఆమె సంతోషంగా "సరే... తీసుకుపో" అంటూ రూపాయిపుచ్చుకోని సొరకాయ వాని చేతిలో పెట్టింది. వాడు సొరకాయ తీసుకోని పోయినాక కూర చేసుకుందామని మధ్యకు కోసినాడు. కోస్తే ఇంకేముంది లోపలంతా ధగధగధగమని బంగారు... బంగారు కాసు. అది చూసి వాడు వెంటనే ఒక బండి కట్టుకోని ఆమె దగ్గరకు పోయి "అమ్మా...అమ్మా... మా వీధిలో అందరూ సొరకాయలు అడుగుతా వున్నారు... ఇస్తావా... ఒక్కొక్కదానికి ఒక్కొక్క రూపాయి ఇస్తా" అన్నాడు.

దానికామె సంబరంగా 'అలాగే' నంటూ సొరకాయలన్నీ తెంపి వాని బండికేసింది. వాడు ఆమె చేతిలో రెండొందల రూపాయలు పెట్టి ఇంటికి తీసుకోనిపోయి బంగారంతా తీసేసుకున్నాడు. ఆ రోజు నుండీ వారానికోసారి ఇంటికాడికి వచ్చి కాసిన కాయలు కాసినట్టు తీసుకుపోసాగినాడు. కొన్నినెలల తరువాత అక్క ఎలా వుందో చూడడానికని తమ్ముడు మరలా అడవికి పోయినాడు. అక్క వానికి అడిగిన పిండివంటలన్నీ చేసి పెట్టి ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ ఇంటి పరిస్థితంతా తెలుసుకోనింది. తమ్ముడు పోయేటప్పుడు మొగుని దగ్గరికి పోయి "సామీ... మా వాళ్ళ బాధలు ఎట్లున్నేవి అట్లానే వున్నాయంట. ఈసారయినా ఏదయినా మంచి సాయం చేయండి" అనింది. ముని "ఏం జరిగిందబ్బా" అని కళ్ళు మూసుకొని జరిగినేదంతా కనుక్కున్నాడు. "గూట్లో ఒక నల్లడబ్బా వుంది. అదిచ్చి పంపు. ఈసారి మీ కష్టాలన్నీ తీరుతాయిలే" అని చెప్పినాడు. ఆమె తమ్మునికి నల్ల డబ్బా ఇచ్చి పంపిచ్చింది.

తల్లి కొడుకిచ్చిన నల్ల డబ్బాలో ఏమున్నాయబ్బా అని తెరిచి చూసింది. దాని నిండా గుమ్మడి గింజలు కనబన్నాయి. ఆమెకు గుమ్మడి కాయలంటే గూడా అస్సలు ఇష్టంలేదు. దాంతో వాటిని గూడా విసిరి ఇంటిబైట పాడేసింది. కొంత కాలానికి వానలు పడడంతో ఆ విత్తనాలు మొలచి ఇంటిచుట్టూ గుమ్మడికాయలు గుంపులు గుంపులు కాసినాయి. కానీ... ఆమెకు గుమ్మడికాయలంటే అస్సలు ఇష్టం లేదుగదా... దాంతో వాటి గురించి ఏమీ పట్టించుకోలేదు.

కోమటాయన ఆ గుమ్మడికాయలను చూసినాడు. సొరకాయల్లోనే అంత బంగారముంటే గుమ్మడికాయల్లో ఇంకెంత వుంటుందో అనుకున్నాడు. వెంటనే బండి కట్టుకోనొచ్చి "అమ్మా...అమ్మా...మా వీధిలో అందరూ గుమ్మడికాయలు అడుగుతా వున్నారు... ఇస్తావా...ఒక్కొక్కదానికి ఐదు రూపాయలిస్తా" అన్నాడు. దానికామె సంబరంగా అలాగేనంటూ గుమ్మడికాయలన్నీ తెంపి వాని బండికేసింది. వాడు ఆమె చేతిలో ఐదొందలు పెట్టి వాటిని ఇంటికి తీసుకోనిపోయినాడు.

ఎవరూ చూడకుండా తలుపులన్నీ మూసి సంబరంగా కత్తి తీసుకోనొచ్చి రపరపరప గుమ్మడికాయలను అడ్డంగా కోసినాడు. అంతే... లోపల్నుంచి తేళ్ళు, జర్రులు కుప్పలు కుప్పలు బైటికొచ్చి వాన్ని కుట్టినచోట కుట్టకుండా వళ్ళంతా కుట్టికుట్టి పెట్టినాయి. దానితో వానికి వళ్ళంతా బాగా విషమెక్కి మంచం పట్టినాడు. ఎక్కడెక్కడి వైద్యుల్ని పిలిపిచ్చినా, ఎన్ని మందులు మింగినా నొప్పి కొంచం గూడా తగ్గలేదు. రోజురోజుకీ నొప్పులెక్కువయిపోయి లబలబలాడసాగాడు. అప్పుడు ఒకరోజు రాత్రి ముని వాని కలలో కనబడి -

"నీవు చేసిన తప్పు దిద్దుకుంటే నీ నొప్పి పోతుంది" అని చెప్పినాడు. దాంతో వాడు తర్వాత రోజు పొద్దున్నే ఇంట్లో వున్న బంగారమంతా బండికేసుకోనిపోయి సుబ్బమ్మ కాళ్ళ మీద పడి జరిగిందంతా చెప్పి బంగారాన్ని తిరిగి ఇచ్చేసినాడు. దాంతో వాని నొప్పంతా తగ్గిపోయి ఎప్పట్లాగే మామూలుగా ఐపోయినాడు. సుబ్బమ్మ ఆ బంగారాన్ని అమ్మి వచ్చిన డబ్బుతో ఒక మంచి మిద్దె కట్టుకోని పేద వాళ్ళను అవసరానికి ఆదుకుంటూ హాయిగా కాలం గడపసాగింది.

- ఎం. హరికిషన్